క్లుప్తంగా

నేడు మాతృత్వ దినోత్సవం



మంగళగిరి: ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలో బుధవారం జాతీయ మాతృత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎయిమ్స్ పీఆర్‌ఓ నేహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురక్షిత మాతృత్వ పద్ధతులు, ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి మంగళగిరి పట్టణంలోని ఇందిరానగర్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రసూతి, గైనకాలజీ, కాలేజీ ఆఫ్ నర్సింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



దుగ్గిరాల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ భాణావత్ ఖుషిబాయి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు.

ఫిరంగిపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని సర్పంచ్ మేడాబాబు అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి రమేష్, పి.హృదయరాజు, అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోండి

మంగళగిరి టౌన్ : ప్రజలు పంపిన సమస్యలను సకాలంలో అధికారులు పరిష్కరించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురమిత్ర మొబైల్ అప్లికేషన్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అయ్యి, ప్రజలు వారి సమస్యలను పొందుపర్చ వచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరపాలక సంస్థ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కండ్రిక మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు నరసింహరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ వైద్యులు శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. ఉచితంగా గుండె సంబంధిత పలు రకాల పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు దీనిని వినియోగించుకోవాలని చెప్పారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

తెనాలి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. స్థానిక బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లోని శ్రీసీతారామమందిరంలో 93వ నవమి వేడుకల్లో మంగళవారం భక్తుల సమక్షంలో శ్రీరమాసహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతాన్ని జరిపారు. ఈ వేడుకల్లో పట్టణానికి చెందిన నేతి ఆంజనేయ శాస్త్రి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మార్కెట్ సెంటర్లోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజ అవరోహణ, గరుడముద్దల ప్రసాద వినియోగం చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి జీవీ అమర నాథ్ పర్యవేక్షించారు.

మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడిగా డాకా సాంబిరెడ్డి

తెనాలి: మహాప్రస్థాన సేవాసమితి, తెనాలి సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం బుర్రిపాలెంరోడ్డులోని కై లాస మహాప్రస్థానంలో నిర్వహించారు. సమావేశంలో 2025–28 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బండి సాంబశివరావు, అధ్యక్షునిగా డాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెట్టి శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారిగా తుమ్మల బాపయ్య చౌదరి ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గంలో చదలవాడ శంకరప్రసాద్, మొవ్వా సత్యనారాయణ, ఆర్ఎస్ శంకరరావు, యలవర్తి గంగాధరరావు, నర్రావుల ఆదినారాయణ, ముద్దా భక్తుని రమణయ్య, రామాయనం వేణు, దేవరప్లి వెంకటేశ్వరరావు, పొట్లూరి శివసుబ్రహ్మణ్యం కాశరనేని శ్రీగిరీష్, కొరటాల ఈశ్వర చంద్, సోమరౌతు సత్యనారాయణను ఎన్నుకున్నట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు.

దడ

ద్విచక్ర వాహనాల చోరీలతో హడలుతున్న ప్రజలు



- వాహనం బయట పెట్టాలంటే బెంబేలు
- తాడేపల్లిలో రాత్రి, పగలు తేడా లేకుండా చోరీలు
- రికవరీలు లేక యజమానులు లబోదిబో
- అదృష్టం కొద్దీ దొరికిన వాహనం గుల్ల గుల్ల

తాడేపల్లి రూరల్: రాత్రి వేళ, జన సంచారం లేని ప్రదేశాల్లో ఎవరూ చూడకుండా దొంగతనాలు జరగడం నిత్యం వార్తల్లో చూస్తుంటాం. కానీ, మంగళగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి, పగలు తేడా లేకుండా జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లోనే సైతం దొంగలు రెచ్చిపోతున్నారు. వ్యాపార సముదాయాలు, రోడ్ల వెంబడి, ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను చిటికెలో మాయం చేస్తున్నారు. దొంగిలించిన వాహనాలను సీసీ కెమెరాల కళ్లు గప్పి గంటల వ్యవధిలో ఆయా ప్రాంతాల నుంచి తీసుకెళ్లిపోతున్నారు. బైక్‌ను విడి భాగాలుగా.. నామరూపాలు లేకుండా చేసి బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు.

రోజుకో బైక్ దొంగతనం

గత కొంతకాలంగా మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్‌లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ప్రతిరోజు ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి.

– మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి కేఎల్ రావు కాలనీ వద్ద ఓ ముఠా కార్మికుడు తెల్లవార్లు బస్తాలు మోసి, తెల్లవారుజామున ఇంటికొచ్చాడు. కొండ కింద భాగంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి, చెయిన్‌తో తాళం వేశాడు. ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ బండి ఆచూకీ లభించలేదు.

- మంగళగిరి పట్టణంలో నవులూరుకు చెందిన ఓయువకుడు ఓ దుకాణంలో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. దుకాణానికి కొంచెం దూరంలో రోజూ బండి పార్క్ చేస్తాడు. ఓ రోజు మధ్యాహ్నం 1.30 సమయంలో బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశాడు. కనీసం బండి ఈఎంఐలు కూడా చెల్లించలేదంటూ వాపోయాడు.
- దుగ్గిరాల గ్రామంలోని ఓ గ్యాస్ కంపెనీ వద్దకు ఓ రైతు తన ఎక్స్ఎల్ వాహనంపై వచ్చాడు. లోపలికెళ్లి సిలిండర్ తీసుకొచ్చే లోపల ఎక్స్ఎల్‌ను ఎత్తుకెళ్లిపోయారు. పంట పొలాల్లో తిరిగే వాహనం కావడం, బండికి ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు ఏమీ లేకపోవడంతో ఆ రైతు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

బైక్ భాగాలు మిస్సింగ్..

ఆ చోరీకి గురై దొరికి వాహనాల్లో చాలా పార్ట్‌లు ఉండడం లేదు. వాటిని దొంగలు ఎత్తుకెళ్లిపోవడంతో.. పాటు మరికొన్ని పార్ట్‌లు విరిగిపోవడంతో ఆ వాహనాలను బాగు చేయించుకోవడానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో వందకు పైగా ద్విచక్ర వాహనాల చోరీలపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. కానీ, వాటిన్నంటిపై కేసులు కట్టడం లేదని తెలుస్తోంది. ఒక్క మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోరీకి గురైన వాహనాల్లో 18 వాహనాలను మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన పోలీస్ స్టేషన్‌లలో ఎక్కడా కూడా ద్విచక్రవాహనాలు రికవరీ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. వాహనదారులు తమ వాహనాలను భద్రపర్చుకునే బాధ్యత మీదేనంటూ పోలీసులు చేతులు దులుపుకుంటున్నారు.

అదృష్టం బాగుంటే రికవరీ..

నియోజకవర్గ వ్యాప్తంగా వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. పోలీసులు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. రికవరీలపై పూర్తిస్థాయి దృష్టి సారించడం లేదు. కొందరైతే కేసులు నమోదు కాక, వాహనాలు కనిపించక తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. ఫైనాన్షియర్లు ద్విచక్ర వాహనం చోరీకి గురైందని చెబితే కంప్లయింట్ పేపరు తీసుకురావాలి లేదా ఇన్‌స్టాల్ మెంట్స్ కట్టాలని వారిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక యజమానులు తలలు పట్టుకుంటున్నారు. చోరీ చేసిన కొన్ని వాహనాలను దొంగలు సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్లి వదిలివేస్తున్నారు. అదృష్టం బాగుంటే అక్కడి పోలీసులు ద్విచక్ర వాహనాలను గుర్తించి, బండి నంబరు ఆధారంగా యజమానికి సమాచారం ఇస్తున్నారు.



చోరీకి గురై... మంగళగిరి పోలీసులు రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలు (ఫైల్ ఫొటో)

గ్యాస్‌బండ ధరపై నిరసనలు

తాడేపల్లి రూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకుడు మేముల దుర్గారావు ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు పల్లె కృష్ణ, బూరగ వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాస కుమారి, సుబ్బారెడ్డి, బాబూరావు, కోదండరామయ్య పాల్గొన్నారు.

ఉండవల్లిలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ రోడ్డుపై పెట్టి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కమిటీ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ గ్యాస్ బండ ధర పెంచడం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవలే ఔషధాల రేట్లు పెంచిన కేంద ప్రభుత్వం ఇప్పుడు సామాన్యులు వాడే గ్యాస్‌పై భారాన్ని మోపారని మండిపడ్డారు. నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఆర్మీ రాఘవయ్య పాల్గొన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీపీఎం గ్రామ కార్యదర్శి నాగపోగు విజయరాజు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రజలపై అదనపు భారం వేస్తూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచిన ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికి 9 సార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, గుడివాడ సామ్యవాదం, తురక సాంబయ్య, పిల్లి పాములు, నరసయ్య, దేవదాసు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుండిమెడలో సీపీఎం నాయకుల ఆందోళన



తాడేపల్లి బోసుబొమ్మ వద్ద సిలిండర్‌తో సీపీఎం నేతల నిరసన

అండర్ -19 ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక



మోషే రాజు



పవిత్ర పావని



ఎంపికైన ఫిరంగిపురం క్రీడాకారులు

మేడికొండూరు: మండలంలోని కొర్రప్రాడు గ్రామానికి చెందిన ఫుట్ బాల్ క్రీడాకారులు మొఖరాల పవిత్ర పావని, మోషే రాజుఅండర్ – 19 ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై నట్లు మేడికొండూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మొఖరాల శ్రీనివాసరావు, కార్యదర్శి మానుకొండ బ్రహ్మాజీ మంగళవారం తెలిపారు. 2024 నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ స్టేట్ లెవెల్ ఫుట్ బాల్ టోర్నమెంట్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఫిరంగిపురం నుంచి..

ఫిరంగిపురం: అండర్–19 రాష్ట్ర ఫుట్ బాల్ జట్టుకు ఫిరంగిపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారులు వి.విల్‌స్మిత్, ఏ.స్టాలెన్ ఎంపికై నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంయుక్తంగా మంగళవారం తెలిపారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం

మంగళగిరి టౌన్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాత మంగళగిరి సీతారామ కోవెలలో మంగళవారం సీతారాముల వసంతోత్సవం ఘనంగా జరిగింది. గ్రామోత్సవం సీతారాముల కోవెల నుంచి ప్రారంభమై మిద్దె సెంటర్ వరకు చేరుకుని.. తిరిగి కోవెలకు చేరుకుంది. ఆయా సెంటర్లలో భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని, టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. దేవస్థానం అర్చకులు నంబూరి వంశీకృష్ణమాచార్యులు బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవానికి పట్టణానికి చెందిన కొల్లి లక్ష్మీ గిరిధరరావు, సుజాత దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణకుమారి, సీతానాగ మల్లేశ్వరి, కల్యాణి పాల్గొన్నారు.



సీతారాముల గ్రామోత్సవం

రాజధాని పారిశుద్ధ్య కార్మికుల నిరసన

తాడేపల్లి రూరల్ : రాజధానిలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ పెనుమాక, ఉండవల్లి పంచాయితీ, ఉండవల్లి సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.వేణు, సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, సీఆర్డీఏ అధికారులు, ఏజెన్సీ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణం పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ నుంచి తొలగిస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గురవయ్య, రాయప్ప, సుందరరావు, సుబ్బమ్మ, మేరీ, కోటేశ్వరమ్మ, పౌలు, స్వరూప, రాఘవేంద్ర, కృష్ణ స్వర్ణకుమారి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రాజధాని మున్సిపల్ కార్మికులు

వంటగ్యాస్ ధర తగ్గించాలని నిరసన

ఫిరంగిపురం: వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.రాఘవయ్య, జి.వెంకటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, షేక్.ఖాజామస్తాన్‌వలి, కె.సుబ్బారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కార్మికుల కష్టాలను తీర్చాలి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని చెప్పారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారని ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదనం, బి.అంకయ్య, దుర్గా భవాని, సారమ్మ, హగ్గయ్య, ఇమాంబి, సుబ్బారావు ఇశ్రాయిల్, గురవయ్య, పిచ్చయ్య, లక్ష్మి పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

రేపటి నుంచి పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

మంగళగిరి టౌన్: ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ కార్యదర్శి కారుమంచి రామారావు తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్, ఎస్సీ ఎస్టీ రైట్స్‌యాక్ట్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ పలు సేవాకార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వాడవాడలా అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరి గరికముక్కు డేవిడ్, సభ్యులు గోవిందరాజు, రాజారావు, బాల, సంసోను, రవి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ సభ్యులు

రేపట్నుంచి జన సేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణ

మంగళగిరి టౌన్ : ఈ నెల 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు చినకాకానిలో జనసేవా దళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చినకాకాని సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అకాల వరదలు, జాతీయ విపత్తు సంభవించినప్పుడు, రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, జాతర్లు, ఉద్యమాల వంటి సందర్భాల్లో జనసేవాదళ్ వలంటరీ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం, గరుడాచలపాలెం, గుండాలపాడు, బేతపూడి, గొల్లపాలెం, కండ్రిక, మేరికపూడి, రేపూడి, పొనుగుపాడు, వేమవరం, వేములూరిపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు మంగళవారం నిర్వహించినట్లు విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ బి.విజయకృష్ణ తెలిపారు. తనిఖీల్లో 35 మంది అధికారులు, 130 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 2,066 సర్వీసులు తనిఖీ చేసినట్లు చెప్పారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మంది నుంచి అపరాధ రుసుం రూ.28 వేలు, అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 9మంది నుంచి రూ.1.40లక్షలు, అనుమతించిన లోడుకన్నా అదనంగా విద్యుత్ వాడుతున్న 32మందికి రూ.3.42లక్షలు అపరాధ రుసుం విధించామని వెల్లడించారు. ఈ సమావేశంలో సీఆర్‌డీపీ పర్యవేక్షక ఇంజినీర్ పి.సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, డీపీఈ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు, డీఈఈలు ఎస్ఎం ప్రసాద్, కె.రవికుమార్, గుర్నాథరావు, ఏఈలు చంద్రశేఖర్, కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, ఎ.శివశంకర్, ఆపరేషన్ ఏఈ పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ పర్యవేక్షక ఇంజినీర్ విజయకృష్ణ

కుంచనపల్లిలో స్వచ్ఛ మంగళగిరి ర్యాలీ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమాన్ని మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఉంచి కార్మికులకు అందజేయాలని సూచించారు. పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రత పాటిస్తే దోమలు, ఈగలు దరి చేరవని అన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డీఈ రాము, ఏఈ అనూష, టీడీపీ నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన నాయకులు మేకల రాజా, బిరుదుగడ్డ రమేష్, కొవ్వూరి సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్లాప్ ఆటోడ్రైవర్ల సమ్మె



మంగళగిరి టౌన్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రెండు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి.శివ, ఎం.రవి, యూనియన్ నాయకులు యోహాన్, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

పన్ను రాయితీపై అవగాహన కల్పించండి

తెనాలిఅర్బన్: ఇంటి పన్ను చెల్లింపులో ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో మంగళవారం సాయంత్రం సచివాలయ అడ్మిన్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు ఇంటి, ఖాళీ స్థల పన్నులు ఒకేసారి చెల్లిస్తే వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. పట్టణంలోని గృహ, స్థల యాజమానులందరూ దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు ఇంటింటికి వెళ్లి రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ మంది పన్నులు చెల్లించే విధంగా చూడాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పన్నుల వసూల్లో తెనాలి ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. పన్ను చెల్లించదలచిన వారు ఆన్‌లైన్‌లో కానీ, వార్డు సచివాలయాల్లో కానీ, మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. వెంటనే పన్నులు చెల్లించి తెనాలి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.